అండర్ టన్నెల్‌ను ముంచెత్తిన వరద నీరు



పాతూరు వద్ద నిర్మాణంలో ఉన్న అండర్ టన్నెల్




అండర్ టన్నెల్‌లోకి భారీగా చేరిన వర్షపు నీరు

- భారీ వర్షాలతో టన్నెల్ నిర్మాణ పనులకు అడ్డంకి
- ఇబ్బందులు పడుతున్న జనం

భీమడోలు: జాతీయ, రాష్ట్రీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న పాతూరు రైల్వే అండర్ టన్నెల్ నిర్మాణ పనులకు వర్షం అడ్డంకిగా మారింది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిర్మాణంలోని టన్నెల్‌లోకి నీరు ముంచెత్తింది. దీనితో టన్నెల్‌లోకి చేరిన వర్షపు నీటిని మోటార్లతో బయటకు తోడుతున్న ప్రతి రోజు కురుస్తున్న వర్షానికి నీరు తరగడం లేదు. దీనితో టన్నెల్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు వద్ద గల రైల్వే గేటు మీదుగా రెండు రహదారుల వైపులా భారీ వాహనాలు, వాహనదారులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనితో పాటు రైతులు, విద్యార్థులు, ప్రజలు ఈ రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగిస్తారు. ఈ తరుణంలో పాతూరు మీదుగా వెళ్లే రైళ్ల సంఖ్య ఎక్కువగా ఉండడంతో తరచుగా గేట్లు వేయడంతో ప్రజలంతా నానా అవస్థలు పడుతున్నారు. దీనితో ఇక్కడ సమస్యను పరిష్కరించేందుకు రైల్వే శాఖ పాతూరు వద్ద అండర్ టన్నెల్‌ను నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. దీనితో రెండు నెలలుగా నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వద్ద అండర్ టన్నెల్‌కు భారీగా నీరు వచ్చి చేరుతుండడంతో నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ పనులు జరుగుతుండడంతో ప్రజలు గుండుగొలను, భీమడోలు మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు తగ్గితేనే పనులు ముందుకు సాగుతాయని నిర్మాణ సిబ్బంది చెబుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

అండర్‌పాస్ పైకప్పు నిర్మాణం ప్రారంభం

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం రైల్వే గేటు వద్ద అండర్‌పాస్ పై కప్పుకు రక్షణగా రేకు షెడ్డు ఏర్పాటు పనులను రైల్వేశాఖ ఉన్నతాధికారులు ప్రారంభించారు. దెందులూరు వైపు దాదాపు పూర్తి కావచ్చింది. అలుగులగూడెం వైపు ఇంకా నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకు అండర్‌పాస్ నిర్మించారే తప్ప పై కప్పు వేయకపోవడంతో రెండువైపులా వర్షపు నీరు మధ్యలో చేరి వేలాది మంది ప్రయాణికులకు అండర్‌పాస్ తీవ్ర ఇబ్బందిగా ఉంది. రైల్వే శాఖాధికారులకు వైఎస్సార్‌సీపీ నాయకులు మొటపర్తి రాంబాబు, టీడీపీ నాయకులు దాసే శ్రీను, బీజేపీ నాయకులు బుజ్జి గోపాల్, అలుగులగూడెం– దెందులూరు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



దెందులూరు- అలుగులగూడెం వద్ద అండర్‌పాస్ పై కప్పు నిర్మాణ పనులు ప్రారంభించిన దృశ్యం

వియ్యంకుడిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఏలూరు టౌన్: వియ్యంకుడిపై దాడిచేసిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు నగర శివారులోని ఇంద్రప్రస్థ కాలనీలో నివాసం ఉంటున్న సీనియర్ జర్నలిస్ట్ బూరగడ్డ శ్రీనివాసా రామానుజ అయ్యంగార్ కుమార్తెను గుంటూరుకు చెందిన ప్రతివాద భయంకర శేషసాయికి ఇచ్చి వివాహం చేశారు. వివాహం అనంతరం కొద్దిరోజుల నుంచి తన కుమార్తెను సరిగ్గా చూసుకోవటం లేదని, వేధిస్తున్నాడంటూ అల్లుడిపై చర్యలు తీసుకోవాలని ఇటీవల అయ్యంగార్ మహిళా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడిపై కేసు పెట్టారనే విషయాన్ని తెలుసుకున్న వియ్యంకుడు శేషావతారం ఈనెల 27న నగర శివారు వట్లూరు సమీపంలో అడ్డగించి దాడి చేసి చేశారని బాధితుడు అయ్యంగార్ ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

సాగునీటి విడుదల

దెందులూరు: స్థానిక అంకన్నగూడెం స్లూయిజ్ కొప్పలవారిగూడెంలోని గుండేరు రెగ్యులేటర్ వద్ద గోదావరి జలాలను దిగువ ప్రాంతాలకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదివారం విడుదల చేశారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో దాదాపు 24,700 ఆయకట్టుకు సాగునీరందించడంతోపాటు దాదాపు 40కుపైగా చెరువులు గోదావరి నీటితో జలకళను సంతరించుకోనున్నాయన్నారు. పెదవేగి మండలం కొప్పాక స్లూయిజ్ ద్వారా విడుదల చేసిన నీరు కొప్పాక, పినకడిమి, పెదకడిమి, దుగ్గిరాల, అమ్మపాలెం, భోగాపురం, వట్లూరు గ్రామాల పరిధిలో 10,700 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. కార్యక్రమంలో పెదవేగి, దెందులూరు మండల టీడీపీ అధ్యక్షులు బొప్పన సుధాకర్, మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), రైతులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

క్లుప్తంగా

దుర్గమ్మకు ఘనంగా ఆషాఢ సారె సమర్పణ



108 మంది భక్తులతో సారె ఊరేగింపు

దెందులూరు: దెందులూరు రామదండు ఆధ్వర్యంలో ఆదివారం కనకదుర్గమ్మకు ఘనంగా ఆషాఢ సారె సమర్పించారు. 108మంది మహిళలు వివిధ రకాల మిఠాయిలు తీసుకుని విష్ణు ఆలయం నుంచి కన్నుల పండువగా ర్యాలీగా కనకదుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామదండు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారి సారె ఊరేగింపును చూసేందుకు వివిధ గ్రామాల నుంచి బంధువులు తరలివచ్చారు.

వెరికోసిస్ ఉచిత వైద్య శిబిరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ఏవీఎస్ హాస్పిటల్ హైదరాబాద్ వారిచే వెరికోసిస్ వ్యాధికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 154 మంది పరీక్షలు చేయించుకున్నారు. వారికి కావలసిన మందులు మానేపల్లి రామారావు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీ పండరీనాథ్, బొలిశెట్టి సురేష్, చెన్నా వెంకటరామయ్య పాల్గొని రోగులకు సేవలు అందించారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ప్రభాకర్

ఏలూరు టౌన్: సమాజంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపడుతుందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలోనూ పోలీస్ అధికారులు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేపట్టారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం రౌడీషీటర్లను స్టేషన్లకు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తూ... రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని, నేరాల్లో జోక్యం చేసుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. రౌడీషీటర్లు తమ కుటుంబం సభ్యులు, పిల్లలను దృష్టిలో పెట్టుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని, ఉపాధి మార్గాలను చూసుకుంటూ సత్ ప్రవర్తన అలవర్చుకోవాలని హితవు పలికారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా కేసుల్లో ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తులోనూ నేరాలకు పాల్పడకుండా సమాజంలో మంచి జీవితాన్ని కలిగి ఉంటామని ఒక నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. నగరంలోని రౌడీషీటర్లు ఏ విధమైన ఉపాధి కలిగి ఉన్నారు, వారి నడవడిక ఏ విధంగా ఉందనే అంశాలపై నిత్యం నిఘా ఉంటుందని సీఐ ప్రభాకర్ తెలిపారు.

ఐఐటీ రూర్కీలో ప్రవేశం పొందిన అన్నుశ్రీ



నిట్టా అన్నుశ్రీతో తల్లిదండులు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, గంగరాజు

దెందులూరు: ఉత్తరాఖండ్‌లోని ఐఐటీ రూర్కీలో దెందులూరు మండల జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, గంగరాజు దంపతుల కుమార్తె అన్నుశ్రీకి కంప్యూటర్ కోర్సు సీటు లభించింది. ఆమె ఇంటర్‌లో 983 సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. ఐఐటీకి ఎంపికైన అన్నుశ్రీని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అన్నుశ్రీని ఆమె తల్లిదండ్రులను చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, ఎమ్మెల్సీ అరుణ్, జెడ్పీ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, శాసన మండలి సభ సభాపతి కె.మోషేన్‌రాజు అభినందించారు. అనంతరం జోగన్నపాలెంలో చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ విజయరాజును జెడ్పీటీసీ సత్కరించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



కొండేపాడులో రోడ్లపై బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం



ట్రాక్టర్‌పై వార్డుల్లో బ్లీచింగ్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

గణపవరం: ఎర్ర కాలువ వరద ముంపు నుంచి తేరుకున్న కొండేపాడులో శానిటేషన్ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టారు. ఇటీవల భారీ వర్షాలు, ఎర్రకాలువ వరదల కారణంగా గణపవరం మండలం ఎస్.కొండేపాడులోకి వరదనీరు ప్రవేశించింది. జగనన్న కాలనీ సహా గ్రామంలోని పలు వీధుల్లో వరదనీరు చేరడంతో గ్రామం ముంపుబారిన పడింది. నాలుగు రోజులుగా వర్షాలు ఆగడంతో ఎర్ర కాలువ ఉధృతి తగ్గుముఖం పట్టి గ్రామంలోని వరదనీరు బయటకు పోవడంతో రోడ్లు బురదమయంగా మారాయి. దీనితో పారిశుధ్య సమస్య తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది శానిటేషన్ పనులు ముమ్మరంగా చేపట్టారు. డ్రెయిన్లలో పూడిక తొలగించి, దోమల నిర్మూలనకు రసాయనాలు పిచికారీ చేశారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో చెత్త, డ్రెయిన్లలో పూడిక తొలగించారు. సర్పంచ్ శీతాలం పుల్లయ్య నాయుడు పర్యవేక్షిస్తున్నారు.

పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు చేయూత



విద్యార్థులను సత్కరించిన ఉంగుటూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

గణపవరం(ఉంగుటూరు): పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు అండగా ఉండి వారి చదువుకు చేయూతనివ్వాలని ఉంగుటూరు మండల విశ్వ బ్రాహ్మణ సంఘ సమావేశంలో పలువురు వక్తలు అన్నారు.ఉంగుటూరులో పంచాయతీ సామాజిక భవనంలో గాయత్రి విశ్వకర్మ సంఘం సమావేశం మండలశాఖ అధ్యక్షుడు అనుపోజు వీరవెంకటబ్రహ్మం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో 2023–24లో పదో తరగతిలో ప్రతిభ చూపిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, డిక్షనరీలను అందజేసి, అభినందనలు తెలిపారు. ఈసమావేశంలో గౌరవాధ్యక్షుడు కవులూరు అప్పారావు, ముఖ్య సలహాదారు గున్నాబత్తులు దేశ్ ముఖ్‌గాంధీ, నిడదవోలు సత్య రవితేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ఏలూరు (టూటౌన్): పేద విద్యార్థుల పట్ల సేవా నిరతి కలిగి ఉండాలని ఏలూరు డివిజన్ రక్షణ సైన్యం మేజర్ జి.జాన్, మేజర్ రత్నమణి తెలిపారు. రక్షణ సైన్యం కరుణా సమాజం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విహాన్ చారిటబుల్ ట్రస్ట్‌చే నిర్వహించబడుతున్న చిల్డ్రన్ హోం నందలి చిన్నారులకు భోజనాన్ని అందించారు. అనంతరం పేద విద్యార్థులకు నూతన దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో రక్షణ సైనం ఫీల్డ్ ఆఫీసర్ కొత్తూరి కిరణ్‌మై, సంఘ పెద్దలు గరికపూడి నెహ్రూ, వెంపా నాగరాజు, నల్లమెల్లి ప్రసాద్, గృహస్తులు జి.సుప్రియ, ఆర్ అంజలి, పి.కస్తూరి, పి.కుసుమ, వి.విజయలక్ష్మి, ఎం.విశ్రాంతి, విస్తం విజయలక్ష్మి, ఎల్.ప్రశాంతి, లక్ష్మీ బేబీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యదాసులకు జ్ఞాపికా ప్రదానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇస్కాన్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో నగరంలో గత వారం జరిగిన జగన్నాథ రథోత్సవ కైంకర్యంలో పాల్గొన్నందుకు కృతజ్ఞతగా, ఏలూరు ఇస్కాన్ అధ్యక్షుడు శ్రీమాన్ రాధావల్లభ ప్రభుజీ తిరుప్పాణీయం – నిత్యదాసు ప్రతినిధులకు ఆదివారం తమ సంస్థ తరపున జ్ఞాపిక ప్రదానం చేశారు. స్థానిక హేలాపురి లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కృతజ్ఞతా పూర్వక గోష్ఠిలో భాగంగా ప్రభుజీ మాట్లాడుతూ 12 మంది ఆళ్వారులలో ఒకరైన తిరుప్పాణాళ్వార్ వారి పరంపరగా తంబురా, చిరుతల వాయిద్య సహకారంతో సంకీర్తనా గానం చేస్తూ, ఎన్నో వందల సంవత్సరాలుగా వైష్ణవ ప్రచారం చేసే వీరందరూ, తమ ఆహ్వానం మేరకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి, దాదాపు 300 మంది ఏలూరుకు వచ్చి రథోత్సవ కైంకర్యంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ధనుర్మాస హరిదాస దీక్షలే కాకుండా హరికథలు, బుర్రకథలు, యక్షగానం, వీధిభాగవతాలు, భజనలు, కోలాటాలు మొదలైన వివిధ కళల ద్వారా క్షేత్రస్థాయిలో వైష్ణవ ప్రచారం చేసే భాగవతులుగా నిత్యదాసులందరికీ ఇస్కాన్ వారి తరపున ప్రభుజీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సామూహిక సంకీర్తన, ప్రవచనాది కైంకర్యాలు నిర్వహించారు.

వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు పరామర్శ

ఏలూరు (టూటౌన్): జిల్లా యాదవ సంఘానికి విశేష సేవలు అందించి గోళ్ల వెంకటేశ్వరరావు ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను యాదవ సంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. చిదరబోయిన శ్రీనివాసరావు, ఏలూరు నగర యాదవ సంఘం అధ్యక్షుడు మెరుగుమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యాదవ సంఘం నాయకులు వెంకటేశ్వరరావు కుమారుడు గోళ్ల రమేష్, సోదరుడు గోళ్ల బసవయ్యలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం తమ వంతుగా ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బొట్టా అజయ్ కుమార్, ఆకుల గంగాధర్, నెరుసు నెలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో వైద్యశాఖాధికారుల పర్యటన



సీతంపేటలో తొట్టెలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



సీతంపేటలో స్థానికులకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: సీతంపేట గ్రామంలో పాఠశాల విద్యార్థికి డెంగీ నిర్ధారణ కావడంతోపాటు అనేక మందికి ప్లేట్‌లెట్స్ పడిపోవడం, జ్వరంతో బాధపడుతుండటంతో జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మూడు రోజులుగా పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌పర్యవేక్షణలో ఎంపీహెచ్‌ఈఓ, పీహెచ్‌ఈఎస్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నివారణ చర్యలు చేపట్టారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటా జ్వరాల సర్వే చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లి విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తున్నారు. ఆదివారం స్థానిక దళితవీధిలో వైద్య సిబ్బంది పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రకృతి పరిరక్షణ దినోత్సవ ఆవశ్యకతను చిన్నారులకు వివరిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: ప్రతి ఒక్కరూ ప్రకృతి ప్రేమికులు కావాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత చిన్నారులు సామూహిక పుస్తక పఠనం చేశారు. మండే సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించాలని, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, వివిధ పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.

కృష్ణా డెల్టాకు సాగునీరు అందించాలి



కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): కృష్ణాడెల్టాకు సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఒకవైపు అతివృష్టి, మరోవైపు అనావృష్టి పరిస్థితులు ఉండటం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కృష్ణా డెల్టా పరిధిలో ఏలూరు, పెదపాడు, దెందులూరు మండలాల్లోని భూములకు సాగునీరు అందక పంట పొలాలు బీటలు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని కోరారు. సాగునీరు అందించేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని శ్రీనివాస్ హెచ్చరించారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న 'శిక్షా సప్తాహ్'



భీమడోలు మండలం అన్నేవారి గూడెం పాఠశాలలో నాటడానికి తెచ్చిన మొక్కలతో విద్యార్థులు



బువ్వనపల్లి యూపీ పాఠశాలలో ఆటల పోటీలు

- పాఠశాలల్లో ప్రతి రోజూ ఒక ప్రత్యేక కార్యక్రమం
- సోమవారం తిథి భోజనంతో ముగింపు

గణపవరం: జాతీయ విద్యా పథకం (ఎన్‌ఈపీ) కొత్త విద్యా పథకాన్ని ప్రారంభించి నాలుగేళ్లు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వారం రోజులుగా అమలు చేస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఈనెల 29వతేదీ సోమవారం తిథి భోజన్ కార్యక్రమంతో ముగుస్తుంది. ఈనెల 22న ఈ శిక్షాసప్తాహ్ కార్యక్రమం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో ప్రతి రోజూ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. మొదటిరోజు టీఎల్ఎం ప్రదర్శన, రెండో రోజు పునాది అభ్యసన కార్యక్రమం, మూడోరోజు క్రీడా దినోత్సవం, నాలుగోరోజు సాంస్కృతిక దినోత్సవం, ఐదో రోజు సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం నిర్వహించారు. ఆరో రోజు శనివారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా పాఠశాలల్లో నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో ఎకో క్లబ్ డే కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎం కన్వీనర్‌గా 20 నుంచి 50 మంది విద్యార్థులతో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ క్లబ్ సభ్యులతో ఆరు సబ్ టీంలను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లు మంచి నీరు, వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎనర్జీ, భూమి, గాలి, ఆహారం పర్యవేక్షణ చేస్తాయి. శనివారం అన్ని పాఠశాలల్లో అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూలులో చదివే విద్యార్థులు తమ తల్లులతో కలిసి ఒక్కో మొక్కను నాటారు. పాఠశాల ఆవరణలో రకరకాల పూలు, పండ్ల మొక్కలను నాటారు. సప్తాహ్ కార్యక్రమంలో చివరిదైన ఏడో రోజు సోమవారం అన్ని పాఠశాలల్లో తిథి భోజనం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆరోజు మధ్యాహ్న భోజనంతో పాటు ఒక ప్రత్యేక వంటకం కాని, పెరుగు, పండు, స్వీటు, పాయసం తదితర ఏదో ఒకటి దాతల సహకారంతో ఏర్పాటు చేయాలన్నది తిథి భోజనం ప్రత్యేకత. ఎట్టి పరిస్థితుల్లోనూ జంక్ ఫుడ్స్‌కు సంబంధించినవి విద్యార్థులకు ఇవ్వకూడదు. తిథి భోజన కార్యక్రమం విజయవంతం చేయడానికి ఇప్పటికే అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు దాతల సహాయాన్ని సేకరించారు.



నిడమర్రు మండలం చానమిల్లి పాఠశాలలో టీఎల్ఎం ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు పాఠశాలలో తల్లులతో కలిసి మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి అనారోగ్యం కలిగినా వెంటనే వైద్యులను సంప్రదించి సత్వర చికిత్స పొందడం ద్వారా వ్యాధులు ముదరకుండా జాగ్రత్త వహించవచ్చని ఉభయగోదావరి జిల్లాల మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వై.శ్రీరామ్ అన్నారు. స్థానిక అమీనా పేటలో మాధురి హాస్పటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు కేవలం వ్యాపారాత్మక దృష్టితో కాక సామాజిక సేవా దృక్పథంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురి పలువురు రోగులకు థైరాయిడ్, అరికాళ్ల మంటలు, తిమ్మిర్లు, మూర్ఛ వ్యాధి, ఛాతీలో మంట, నరాలు, గుండె సంబంధిత వైద్య పరీక్షలు ,ఈసీజీ నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీ.నాగ దుర్గ శ్రీమన్నారాయణ, గౌంతిన రామకృష్ణ జీ.కృష్ణవంశి, పుచ్చల భరత్, విటాల చైతన్య, విటాల శ్రీలక్ష్మి, యాళ్ళబండి నాని, కట్టా చాందిని, తదితరులు పాల్గొన్నారు.